## రాష్ట్రస్థాయి పోటీలకు 'అమ్రాద్'విద్యార్థులు

ఖలీల్‌వాడి, నవంబర్ 23 : నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో 'ఎనర్జీ కన్జర్వేషన్' అనే అంశంపై నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో అమ్రాద్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మధుప్రియ, సాత్విక్ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం సురేశ్ తెలిపారు. విద్యార్థులతో పాటు వీరిని ప్రోత్సహించిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు తర్ల రమేశ్, హెచ్ఎం సురేశ్‌ను డీఈవో అశోక్ శనివారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలు సోమవారం నిర్వహించనున్నారు.

**సత్యశోధక్ విద్యార్థి ఎంపిక**

సిరికొండ, నవంబర్23: నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలకు మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఫరిన్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య శనివారం తెలిపారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు డిచ్‌పల్లి విద్యార్థిని

డిచ్‌పల్లి, నవంబర్ 23 : కామారెడ్డిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల ఎంపికలో డిచ్‌పల్లి ఆదర్శ కళాశాల విద్యార్థిని పి. అక్షయ ( సీఈసీ ప్రథమ) ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దశరథ్ తెలిపారు. ఈ నెల 23 నుంచి 25 వరకు రంగారెడ్డిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అక్షయను పీడీ సంజీవ్, అధ్యాపకులు అశోక్, మహేశ్ రాణి, గంగప్రసాద్, శ్రీనిజా, కుల్‌దీప్, సురేశ్, అధ్యాపకులు అభినందించారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తరలిన జిల్లా జట్టు

కంఠేశ్వర్, నవంబర్ 23 : మెదక్ జిల్లా మాసాయిపేట్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఈ నెల 23, 24వ తేదీల్లో నిర్వహించనున్న 9వ రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్‌పోటీలకు జిల్లా జట్టు బయల్దేరినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మార్కంటి గంగామోహన్ శనివారం తెలిపారు. జట్టుకు కోచ్, మేనేజర్లుగా నరేశ్, సాయికుమార్, తిరుపతి వ్యవహరిస్తున్నారు.

## 'మాలల సింహగర్జన' విజయవంతం చేయాలి

పోతంగల్, నవంబర్ 23 : మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో మాల సంఘం ఆధ్వర్యంలో శనివారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. డిసెంబర్ ఒకటిన హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాల మహానాడు అధ్యక్షుడు సోంపూర్ రాహుల్ సోన్ కాంబ్లే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు బోధన్ డివిజన్ నాయకుడు దాసరి శ్యామ్, మండల కార్యదర్శి వీరు, మండల ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, యాదవ్ రావు, మండల సహాయక కార్యదర్శి మస్కలే నాగనాథ్, కొడిచర్ల మాజీ సర్పంచ్ భీమ్‌రావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

జక్రాన్‌పల్లి, నవంబర్ 23: మండలంలోని కలిగోట్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రూ.30వేల విలువ గల క్రీడా దుస్తులను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తమాచారి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సువర్ణ, సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయ బృందం, గ్రామ కమిటీ సభ్యులు రవి, రాజేందర్, శోభన్, చిరంజీవి, వెంకటసత్యనారాయణ గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## అర్గుల్ గ్రామానికి ఫ్రీజర్ వితరణ

జక్రాన్‌పల్లి, నవంబర్ 23 : మండలంలోని అర్గుల్‌కు చెందిన ఏనుగు నర్సారెడ్డి తన తండ్రి పెద్దమల్లారెడ్డి జ్ఞాపకార్థం గ్రామానికి ఫ్రీజర్‌ను వితరణ చేశారు. శనివారం మండల ప్రత్యేకాధికారి ప్రవీణ్, తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో సతీష్‌కుమార్ చేతుల మీదుగా గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌కు అందజేశారు. దాత నర్సారెడ్డిని అభినందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొర్త పద్మ రాజేందర్, గ్రామ కమిటీ సభ్యులు రాజారెడ్డి, రఘుపతిరెడ్డి, సాయన్న, సుధాకర్, గంగారాం, సురేశ్ పాల్గొన్నారు.

## 'ఆర్పీ, సీవోలపై చర్యలు తీసుకోవాలి'

కంఠేశ్వర్, నవంబర్ 23 : జిల్లా కేంద్రంలో దాదాపు 23 డ్వాక్రా గ్రూపు మహిళా సంఘాలకు రుణాలు, పొదుపు డబ్బులు రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న ఆర్పీ, సీవోలపై చర్యలు తీసుకోవాలని హమాల్‌వాడికి చెందిన బాలాజీ శ్రీనిధి డ్వాక్రా గ్రూప్ సభ్యులు మెప్మా కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. స్త్రీనిధి సీవోలు లావణ్య, సవిత, మధుప్రియ, ఆర్పీలు స్వర్ణలత, కవిత, జ్యోతి 13 గ్రూపుల నుంచి స్త్రీనిధి డబ్బులు వసూలు చేస్తూ సభ్యులకు ఓచర్ ఇవ్వడంలేదని పేర్కొన్నారు. వారు బ్యాంకులో కట్టకపోగా.. అధికారులకు లోన్ డబ్బులు కట్టడం లేదని తప్పుడు సమాచారం ఇవ్వడంతో దాదాపు 23 గ్రూపులకు లోన్స్ రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. డ్వాక్రా సంఘాల సభ్యులు సాయిగంగా, శ్రీనవచైతన్య, తిరుమల, కరుణామయ, గణేశ్ సంఘాల సభ్యులు ఉన్నారు.

# అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి

**బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి**



పోతంగల్‌లో ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కోటగిరి(పోతంగల్), చందూర్ (మోస్రా) నవంబర్ 23 : అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ -2025 కార్యక్రమంలో భాగంగా శనివారం పోతంగల్, చందూర్, మోస్రా మండలాల్లో స్పెషల్ క్యాంపెయిన్లను సందర్శించారు. ఇప్పటి వరకు ఎంతమంది ఓటర్లను నమోదు చేశారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరుగా నమోదు చేసుకునేలా చైతన్య పరచాలని సూచించారు. తహసీల్దార్లు గంగాధర్, శాంత, ఎంఈవోలు శంకర్, శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

## జిల్లా సమాఖ్య భవన నిర్మాణానికి నిధులు

కంఠేశ్వర్, నవంబర్ 23 : జిల్లా సమాఖ్య నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు డీఆర్డీవో సాయాగౌడ్ తెలిపారు. భవన నిర్మాణం కోసం ఎకరం స్థలాన్ని కేటాయించారని పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని డీఆర్డీఏ కార్యాలయంలో శనివారం జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా సంస్థాగత నిర్మాణం, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, మండల సమైక్య గ్రామ సమస్యలు, ఆడిట్ తదితర విషయాలపై చర్చించారు. సమావేశంలో సెర్ప్ అధికారి భారతి, డీపీఎంలు సంధ్యారాణి, సాయిలు, శ్రీనివాస్, మారుతి, స్త్రీనిధి ఆర్ఎం రాందాస్, ఏపీఎం సరోజిని, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రాధ, కార్యదర్శి లావణ్య, కోశాధికారి లక్ష్మి, 28 మండల సమాఖ్యల అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో గణతంత్ర వేడుకలకు టీయూ విద్యార్థులు

డిచ్‌పల్లి, నవంబర్ 23 : ఢిల్లీలో జనవరి 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొననున్నారని వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. మహారాష్ట్ర యూనివర్సిటీ జల్గాన్‌లో ఈ నెల 12 నుంచి 21 వరకు నిర్వహించిన వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌లో తెలంగాణకు చెందిన 30 మంది వలంటీర్లు పాల్గొనగా.. తెలంగాణ యూనివర్సిటీ నుంచి ఎంపికైన వలంటీర్లు తరుణ్, సింధూవిజలను వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి శనివారం అభినందించారు.

## 'విద్యార్థుల ప్రాణాలతో కార్పొరేట్ కళాశాలల చెలగాటం'

ఖలీల్‌వాడి, నవంబర్ 23: కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని పీడీఎస్‌యూ నాయకులు అన్నారు.కార్పొరేట్ కళాశాలల్లో వరుసగా జరుగుతున్న విద్యార్థుల మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. నగరంలోని కోటగల్లీ ఎన్ఆర్ భవన్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేశ్ శనివారం విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్ కళాశాలలు ర్యాంకుల కోసం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని మండిపడ్డారు. హైదరాబాద్ శ్రీచైతన్య విద్యార్థి కౌశిక్ రాఘవ ఆత్మహత్యకు కళాశాల యాజమాన్యం ఒత్తిడే కారణమని పేర్కొన్నారు. వేధింపులు తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే శ్రీచైతన్య కాలేజీ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు మహిపాల్, నశీర్, సమీర్, శివ పాల్గొన్నారు.

## ఘనంగా సత్యసాయిబాబా జయంతి

సుభాష్‌నగర్/ధర్పల్లి/బోధన్, నవంబర్ 23: జిల్లా కేంద్రంతోపాటు ధర్పల్లి, బోధన్‌లో సత్యసాయిబాబా జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, రుద్రాభిషేకం, మహాప్రసాదం, వేదపఠనం, సాయి గాయత్రి భజన, డోలోత్సవం తదితర కార్యక్రమాలు కొనసాగాయి. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## ఘనంగా ఫెయిత్ బాప్టిస్ట్ చర్చి వార్షికోత్సవం

సారంగాపూర్, నవంబర్ 23 : నగరంలోని వినాయక్‌నగర్‌లోని ఫెయిత్ బాప్టిస్ట్ చర్చి 27వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో పాటలు పాడి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ రెవరెండ్ దారం అబ్రహం, డిచ్‌పల్లి ఫెయిత్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ మోహన్ ప్రవచనాలు బోధించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. శనివారం రాత్రి భక్తులు క్యాండిల్ వెలిగించి క్యాండిల్ నైట్ సర్వీస్ కార్యక్రమాన్ని నిర్వహించగా.. పాస్టర్లు థామస్, రేచల్, చర్చి అభివృద్ధి కమిటీ ప్రతినిధులు రాజన్న, భగవాన్‌రెడ్డి, బాబురావు, భూషణం, నరేందర్ పాల్గొన్నారు.

## మెడికల్ షాపులో చోరీ

వినాయక్‌నగర్, నవంబర్ 23: జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తా వద్ద ఉన్న మెడికల్ షాపులో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. మెడిలైఫ్ ఫార్మసీ షట్టర్‌ను ధ్వంసం చేసిన దుండగులు లోనికి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.2 లక్షల నగదును ఎత్తుకుపోయారు. దుండగులు తమ ఆనవాళ్లు పోలీసులకు చిక్కకుండా షాపులో ఉన్న సీసీ కెమెరాల హార్డ్ డిస్క్‌ను సైతం దొంగిలించుకుపోయారు. శనివారం ఎస్సై ఆరీఫ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్‌ను రప్పించి షాపులో వేలిముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. షాపు యజమాని అజయ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయాలి

ఖలీల్‌వాడి, నవంబర్ 23 : ప్రభుత్వ దవాఖానలను బలోపేతం చేయాలని, ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్స్ ఫీజుల దోపిడీని అరికట్టాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లాకేంద్రంలో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు కె.సంధ్యారాణి, సాయిబాబా మాట్లాడారు. ప్రభుత్వ దవాఖానల్లో అన్ని రకాల వైద్యపరీక్షలకు సదుపాయాలు కల్పించాలన్నారు.

## వ్యవసాయ కూలీల సంక్షేమం పట్టని ప్రభుత్వాలు

సిరికొండ, నవంబర్ 23: ప్రభుత్వాలు వ్యవసాయ కూలీల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేశ్ విమర్శించారు. శనివారం మండలంలోని పందిమడుగు, చీమన్‌పల్లి, తాటిపల్లి, చిన్నవాల్గోట్, పెద్దవాల్గోట్, పోతునూర్, కొండాపూర్ గ్రామాల్లో వ్యవసాయ కూలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

ధర్పల్లి, నవంబర్ 23: మండలంలోని గోవిందుపల్లి గ్రామపరిధిలో ఉన్న శ్రీవేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవాలు రెండు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి శ్రీదేవి భూదేవి సహిత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## సంక్షిప్తంగా..

- **ఇంటిగ్రేటెడ్ కోర్స్ టైంటేబుల్ విడుదల:** డిచ్‌పల్లి, నవంబర్ 23 : టీయూ పరిధిలో ఇంటిగ్రేటెడ్ కోర్సు-2024 టైంటేబుల్ విడుదల చేసినట్లుపరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య ఎం.అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ ఐదేండ్ల కోర్సు (ఏపీఈ, ఐపీసీహెచ్) 5వ, 7వ, 9వ సెమిస్టర్ రెగ్యులర్, ఐఎంబీఏ, ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ రెగ్యులర్ ఎగ్జామ్స్ డిసెంబర్ 5 నుంచి 16 వరకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలు టీయూ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు.

**పరీక్షల ఫీజు :** ఇంటిగ్రేటెడ్ కోర్స్ పరీక్షల ఫీజు చెల్లించడానికి తేదీలను ప్రకటించారు. ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల (ఏపీఈ ఐపీసీహెచ్) 5వ, 7వ, 9వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు (థియరీ, ప్రాక్టికల్), ఐఎంబీఏ, ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు (థియరీ, ప్రాక్టికల్) డిసెంబర్‌లో నిర్వహించనున్నారు. పరీక్షల ఫీజు అపరాధ రుసుము లేకుండా ఈ నెల 28 వరకు, రూ.100 అపరాధ రుసుముతో డిసెంబర్ 2 వరకు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారిణి ఆచార్య అరుణ తెలిపారు.

- **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం :** కంఠేశ్వర్, నవంబర్ 23: జిల్లా కేంద్రంలోని ప్రగతినగర్, పానుగంటి గార్డెన్ ప్రాంతాల్లో 11 కేవీ లైన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ 2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.
- **రైతులకు అందుబాటులో ఎరువులు:** రుద్రూర్, నవంబర్ 23 : రుద్రూర్ మండలంలోని రాయకూర్, రుద్రూర్ వ్యవసాయ సహకార సంఘాలను శనివారం మండల వ్యవసాయ అధికారి సాయికృష్ణ సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం మాట్లాడుతూ.. సహకార సంఘాల్లో ఎరువుల కొరత లేదని, రైతులు తమ పంట పొలాలకు కావలసినంత సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట ఏఈవో వెంకటేశం, కార్యదర్శి సాయికిరణ్ ఉన్నారు.
- **లారీ బోల్తా..:** పోతంగల్, నవంబర్ 23 : ఎదురుగా వస్తున్న కారుకు సైడ్ ఇవ్వబోయి ఓ లారీ అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటన మండలంలోని హెగ్డోలి గ్రామ శివారులో శనివారం చోటు చేసుకున్నది. వరి ధాన్యం లోడ్ కోసం హెగ్డోలికి వెళ్తున్న లారీ.. ఎదురుగా వస్తున్న కారుకు సైడ్ ఇవ్వబోయి కల్వర్టులోకి దూసుకెళ్లి బోల్తా పడింది. డ్రైవర్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

## చెక్‌పోస్ట్ దహనం చేసిన నిందితుడికి రిమాండ్

కోటగిరి(పోతంగల్), నవంబర్ 23 : మండలంలోని కొడిచర్ల శివారులో చెక్‌పోస్ట్‌ను దహనం చేసిన ఘటనలో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణ శనివారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. ఇసుక మాఫియా దుండగులు నిప్పు పెట్టారని అనుమానం వ్యక్తం చేస్తూ పోతంగల్ తహసీల్దార్ మల్లయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డోంగ్లీ మండలం సిర్పూర్‌కు చెందిన నిందితుడిని పట్టుకొని విచారించగా తానే నేరం చేశానని ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## జాతీయ సదస్సులో డాక్టర్ విశాల్



డాక్టర్ విశాల్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఖలీల్‌వాడి, నవంబర్ 23 : మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ నెల 21 నుంచి 24 వరకు భారత ప్రైవేట్ సైకియాట్రిక్ అసోసియేషన్ 25వ వార్షిక జాతీయ సదస్సు నిర్వహిస్తుండగా, జిల్లాకు చెందిన న్యూరో సైకియాట్రిస్ట్, డ్రగ్ డీ అడిక్షన్ స్పెషలిస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ విశాల్ ఆకుల 'మెటబాలిక్ డిజార్డర్స్ సైకియాట్రిక్ సమస్యలు వాటి నివారణ' అనే అంశంపై ప్యానల్ చర్చ కోసం ప్రత్యేక వక్తగా ఆహ్వానించారు. డాక్టర్ విశాల్‌తోపాటు ఆయన బృందం మెటబాలిక్ డిజార్డర్స్‌కు సంబంధించి డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడితో కూడిన లక్షణాలపై విలువైన వివరాలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశాల్‌ను నిర్వాహకులు సత్కరించారు.

## విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలి



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న ఎంఈవో ఆంధ్రయ్య

మోర్తాడ్, నవంబర్ 23: విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషకాహారాన్ని అందించాలని ఎంఈవో ఆంధ్రయ్య ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కమ్మర్‌పల్లిలో శనివారం ఏర్పాటుచేసిన హెచ్ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 4న నిర్వహించే ఎన్ఏఎస్ పరీక్షకు 3,6,9వ తరగతి విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. ఎస్సెస్సీ వార్షిక పరీక్షలకు విద్యార్థులు బాగా చదివేలా చూడాలన్నారు. హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

***మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వద్దు..***

రెంజల్, నవంబర్ 23: మధ్యాహ్న భోజనంపై నిర్లక్ష్యం వహించొద్దని హెచ్ఎంలు పర్యవేక్షించాలని ఎంఈవో ఆంజనేయులు అన్నారు. హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని వడ్డించాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. నీలా కాంప్లెక్స్ హెచ్ఎం ఇల్తెపు శంకర్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు తాళ్ల సామ లింగంగౌడ్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

## గ్యాస్ వాడకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోటపాటి నర్సింహానాయుడు

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 23: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వంట గ్యాస్ వాడకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్, వంశీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రొపరేటర్ కోటపాటి నర్సింహానాయుడు మాట్లాడుతూ.. గ్యాస్ వినియోగదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## హత్యాయత్నం కేసులో ఒకరి రిమాండ్

నవీపేట, నవంబర్ 23: మండల కేంద్రంలో ఈనెల 18 జరిగిన హత్యాయత్నం కేసులో ఒకరిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సైవినయ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నవీపేటలో డీజే సౌండ్ విషయంలో షేక్ సోహెల్‌పై నవీపేటకు చెందిన షేక్ గౌస్ చాకుతో దాడిచేసి హత్యాయత్నం చేశాడు. సోహెల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

## పశుగణన ప్రారంభం

మాక్లూర్, నవంబర్ 23: మండలంలో భారత 21వ పశుగణన కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమామసాహేర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణన కొనసాగుతుందన్నారు. ప్రజలు అన్ని రకాల పశువుల వివరాలను పశువైద్య సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. పశుపోషకుల సామాజిక, ఆర్థిక వివరాలు కూడా నమోదు చేసుకుంటామని తెలిపారు. ఇంటికి వచ్చే పశుసంవర్ధక శాఖ అధికారులకు సహకరించాలని సూచించారు.

# కులాల్లో చిచ్చు పెట్టేందుకే ఎస్సీ వర్గీకరణ

**మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య**



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు బాధ్యులు

నవీపేట,నవంబర్ 23: బీజేపీ కులాల్లో చిచ్చు పెట్టేందుకు, స్వార్థపూరిత రాజకీయాల కోసం ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిందని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఆనం ఎల్లయ్య అన్నారు. మాలల సింహగర్జన పోస్టర్లను మండల కేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఎస్సీ వర్గీకరణ అనంతరం ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తే వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. డిసెంబర్ ఒకటిన నిర్వహించే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బుద్ధ ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ బల్వాన్, మాజీ ఎంపీపీ సంగెం శ్రీనివాస్, మాల మహానాడు నాయకులు సొసైటీ వైస్ ప్రెసిడెంట్ దొంత ప్రవీణ్‌కుమార్, నీరడి బుచ్చన్న, గౌరు రాజు, గైని సతీశ్, గైని మోహన్, శ్యామ్, సుధాకర్, అబ్బాస్, రవి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

***సింహగర్జనను విజయవంతం చేయాలి..***

భీమ్‌గల్, నవంబర్ 23: భీమ్‌గల్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మాలల సింహగర్జన పోస్టర్లను ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్ అంగరి ప్రదీప్, ఆర్మూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు పులి సాయిరాం ఆధ్వర్యంలో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డిసెంబర్ ఒకటిన మాలలందరూ హైదరాబాద్ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల సంక్షేమ ఐక్యవేదిక మండల నాయకులు, అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు సక్రమంగా చేపట్టాలని నిరసన



తహసీల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

నందిపేట్, నవంబర్ 23: నందిపేట్‌లో రోడ్డు విస్తరణ పనులు సక్రమంగా చేపట్టాలని కోరుతూ రాంనగర్ కాలనీవాసులు స్థానిక ఐలమ్మ విగ్రహం వద్ద శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నందిపేట్‌ను సుందరంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.12కోట్ల బడ్జెట్‌ను విడుదల చేయించిందన్నారు. కానీ రోడ్డు పనులను ఇష్టానుసారంగా, పూర్తి డ్రైనేజీని నిర్మించకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. రోడ్డు మధ్యలో ఉన్న సమాధులు, దర్గాలను తొలగించాలని రాస్తారోకో చేశారు. స్థానిక ఎస్సై హరిబాబు సముదాయించడంతో రాస్తారోకో విరమించారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సైకి వినతిపత్రాలను అందజేశారు.

## వైద్య శిబిరానికి స్పందన

బాల్కొండ, నవంబర్ 23: సంతనం లేని వారికి శనివారం నిర్వహించిన సంతాన సౌలభ్య ఉచిత వైద్య శిబిరం విజయవంతమైందని గైనకాలజిస్ట్ డాక్టర్ అదుముల్లా శృతి సింధునూరి తెలిపారు. సంతానం లేని దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు.

## అంబంలో మొబైల్ అంబులెన్స్ వైద్య శిబిరం

ఎడపల్లి, నవంబర్ 23: మండలంలోని అంబం గ్రామంలో మొబైల్ అంబులెన్స్ ద్వారా శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 98మందికి నేత్ర పరీక్షలు నిర్వహించగా.. 22మందికి మోతిబిందు ఉన్నట్లు గుర్తించారు. 62మందికి షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా.. 20మంది వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించి తగు సలహాలు అందజేశారు. మనోజ్‌కుమార్, ప్రకాశ్‌రావు, మెర్సీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు

భీమ్‌గల్, నవంబర్ 23: భీమ్‌గల్ జడ్పీహెచ్ఎస్ 2024-25 ఎస్సెస్సీ విద్యార్థుల పరీక్ష ఫీజును ఆంగ్ల ఉపాధ్యాయుడు బద్దం శివకుమార్ చెల్లించారు. ఫీజును ఎంఈవో స్వామి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు లింబాద్రి, వాసుదేవ్, వినోద్‌కుమార్, రఘువాస్, శేఖర్, రాజేందర్ అభినందించారు.

## సీఐకి సన్మానం

భీమ్‌గల్, నవంబర్ 23: భీమ్‌గల్ సీఐగా బాధ్యతలను చేపట్టిన నవీన్‌కుమార్‌కు బీఆర్ఎస్ నాయకులు శనివారం శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ టౌన్ అధ్యక్షుడు నీలం రవి, మున్సిపల్ వైస్‌చైర్మన్ భగత్, యూత్ మండల అధ్యక్షుడు రాంచందర్‌గౌడ్, వైస్‌ప్రెసిడెంట్ జాన్సన్, సోషల్ మీడియా ఫాలోవర్ సునీల్ నారాయణ, యువకులు కార్తీక్, రతన్, శ్రీను, చరణ్, అఖిల్, బిట్టు, హరీశ్, పింకు, అక్షయ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 23: పట్టణ శివారు పిప్రి రోడ్డులో శనివారం స్కూటీ, బైక్ ఢీ కొన్న ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఆర్మూర్ పట్టణానికి చెందిన రాచురి రాకేశ్(30) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాబు స్కూటీని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో రాకేశ్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## 'డాటా ఎంట్రీ ఆపరేటర్'కు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 23: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆపరేటర్ పోస్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అప్‌లోడ్ చేసిన ఒక్కో దరఖాస్తుకు రూ.20 ఇస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న ఆపరేటర్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

మోర్తాడ్, నవంబర్ 23: మోర్తాడ్ శివారులోని జాతీయ రహదారి పక్కన వ్యవసాయ భూముల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న రైతులు పోలీసులకు, విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. ఎస్సై విక్రమ్ శనివారం ఘటనా స్థలాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ పొలాల వైపునకు వస్తే తమకు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

## విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా ముందుకుసాగాలి

నవీపేట, నవంబర్ 23: విద్యార్థులు ప్రణాళికాబద్ధంతో ముందుకు సాగుతూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విస్‌డమ్ మోటివేషన్ అధ్యక్షుడు గొల్లపల్లి గంగాధర్ సూచించారు. నవీపేట, నాగేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శనివారం విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. హెచ్ఎంలు రత్నకుమారి, ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలి'

మోర్తాడ్, నవంబర్ 23: వ్యవసాయ కార్మికులకు జీవనభృతి ఇస్తానన్న రేవంత్ రెడ్డి మాట నిలబెట్టుకోవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామకృష్ణ అన్నారు. మోర్తాడ్‌లో శనివారం ఏర్పాటు చేసిన వ్యవసాయ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న మోర్తాడ్ తహసీల్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు కూలీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కిషన్, మాస్‌లైన్ జిల్లా నాయకులు సురేశ్, సత్తెక్క, పోశెట్టి, సాయక్క, రమణి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అభినందన

ఏర్గట్ల, నవంబర్ 23: బాలల దినోత్సవం సందర్భంగా సాహిత్య పరిషత్, సాహిత్య అకాడమీ వారు ఇటీవల నిర్వహించిన పోటీల్లో ఏర్గట్ల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు బహుమతులను సాధించారు. దీంతో ఉపాధ్యాయులు శనివారం వారిని అభినందించారు. పాఠశాలకు చెందిన అభిలాష్, రాజేశ్, రూపక్, నవదీప్, వైష్ణవి, రిశ్వంత్, శ్రీనిధి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారని తెలిపారు. హెచ్ఎం కోమరగిరి కృష్ణాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలికలు ధైర్యంగా ఉండాలి

ఏర్గట్ల, నవంబర్ 23: బాలికలు ధైర్యంగా ఉండాలని ఏర్గట్ల ఎస్సై రాము అన్నారు. ఏర్గట్ల కేజీబీవీలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. వేధింపులు, లైంగిక దాడులు జరగకుండా ఎలా ఎదురించాలనే విషయాపై ఎస్సై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు, సీఆర్టీలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం తీరుకు వ్యతిరేకంగా పోరాడాలి

బోధన్/ ఆర్మూర్ టౌన్, నవంబర్ 23: కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లేశ్ పిలుపునిచ్చారు. శనివారం బోధన్‌లోని పాన్‌గల్లీలో టీయూసీఐ, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐపీకేఎంఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ 26న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు, కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పడాల శంకర్, జి.సీతారాం, బి.సాయిలు, కేశవులు, శంకర్, భూషణం తదితరులు పాల్గొన్నారు. నరేంద్ర మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్మిక హక్కుల సాధన కోసం ఈనెల 26వ తేదీన చలో నిజామాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు తెలిపారు. ఆర్మూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చలో నిజామాబాద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

## పాఠశాల సందర్శన

ఆలూర్, నవంబర్ 23: మండలంలోని మిర్ధాపల్లి గ్రామ జడ్పీహెచ్ఎస్‌ను మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**పొలం అమ్మబడును**

★ భీమ్‌గల్ మడలంలోని చెంగల్ గ్రామ శివారులో బోర్లు కలిగి రెండు పంటలు వరి పండే 6.14 ఎకరాల పట్టాల్యాండ్ అమ్మకానికి కలదు. సెల్: 9960996111

NTZ- 338221

**PLOT FOR SALE**

★ డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.

NT-326605

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.